క్లుప్తంగా

బాల వికాస్ విద్యార్థుల విహారయాత్ర



బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ విశేషాలను వివరిస్తున్న రామలక్ష్మి

కె.కోటపాడు: స్థానిక బాల వికాస్ కేంద్రం గురువు బండారు రామలక్ష్మి ఆధ్వర్యంలో 66 మంది విద్యార్థులు ఆదివారం ఆధ్యాత్మిక విహారయాత్రకు తరలివెళ్లారు. ఇందులో భాగంగా అనకాపల్లి సమీపంలో బొజ్జన్నకొండను సందర్శించారు. అక్కడ బౌద్ధ విశేషాలను విద్యార్థులకు గురువు రామలక్ష్మి వివరించారు. అనంతరం విద్యార్థులతో వేదం, భక్తి కోలాటం కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కశిరెడ్డి అప్పలనాయుడు, కె.కోటపాడు కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

మాడుగుల రూరల్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఇక్కడ పరీక్ష కేంద్రంలో 450 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్. నీలిమ తెలిపారు. 14 తరగతి గదుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

రేపటి నుంచి మోదమాంబ తీర్థ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వడ్డాది మోదమాంబ

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది జంక్షన్‌లో మోదకొండమ్మ తీర్థ మహోత్సవాలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు మోదమాంబ ఉత్సవ కమిటీ వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా 4న అమ్మవారికి ధూపదీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అదే రోజు రాత్రి 8 గంటలకు యలమంచిలి వారి భలే పిల్లలు నృత్య ప్రదర్శన, 5న అమ్మవారికి పూజలు, 6న రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

72 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మాకవరపాలెం: ఉచిత కంటి వైద్య శిబిరంలో 72 మందికి వైద్య పరీక్షలు చేశారు. స్థానిక మహిళా మార్ట్ వద్ద ఆదివారం విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మంది హాజరై కంటి వ్యాధులపై పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 40 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించామని క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనికుమార్ తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్ష



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి డిపో కండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని ఎన్‌ఎంయూఏ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక డిపో ఆవరణలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ శిబిరాన్ని జోనల్ అధ్యక్షుడు వి.ప్రదీప్ ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా విజయనగరం జిల్లా అధ్యక్షుడు దుర్గ రాజు హాజరై మాట్లాడుతూ తక్షణమే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ఆర్.మూర్తి, ఎం. ఎన్. రావు, ఎం.ఎస్.వాసు, ఆర్.ఎస్.ఆర్.మూర్తి, కె.ఎన్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికులకు సాయం



కార్మికుడికి సాయం చేస్తున్న సంఘ సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : గాయపడిన భవన నిర్మాణ కార్మికులు కంటిపాము అప్పారావు, ప్రకృతి కన్నయ్యకు శ్రీమణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) సభ్యులు ఆదివారం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

పామాయిల్ సాగుపై మక్కువ



గవరవరంలో సాగవుతున్న పామాయిల్ తోటలు

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- వరి, చెరకు పంటలకు అందని ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- చెరకు పేమెంట్లు సకాలంలో అందక ఇబ్బందులు
- పామాయిల్ వైపు దృష్టి సారించిన రైతులు

మాడుగుల: దేశంలోనే అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు ద్వితీయ స్థానాన్ని నిలబెట్టుకొస్తున్న చెరకు రైతులు క్రమంగా చెరకు పంటను వదులుకుంటున్నారు. సాగు భారం కావడంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా పామాయిల్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఏటా సాగు పెంచుతుండడంతో మొదట 500 ఎకరాల్లో ఉండగా, ప్రస్తుతం 9 మండలాల్లో నాలుగు వేల ఎకరాలకుపైగా పెరిగింది. ప్రస్తుతం టన్నుకు రూ. 20 వేలు పెరగడంతో పల్లపు ప్రాంతాలో సైతం వరి, చెరకుకు బదులుగా పామాయిల్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు.

కూలీల కొరత, పెట్టుబడులు భారంతో..

గతంలో మెట్ట ప్రాంతాల్లో పామాయిల్ సాగు చేసే వారు. కూలీల కొరతతో పాటు ప్రభుత్వం, వరి, చెరకుకు సహాయం అందించక పోవడంతో ప్రస్తుతం పామాయిల్ సాగు వైపు మళ్లుతున్నారు. మాడుగుల మండలంలో శంకరం, తాటిపర్తి, అవురువాడ, ఎం. కోడూరు. కేజేపురం, తదితర పంచాయతీల్లో ఈ సాగు విస్తారంగా ఉంది. దేవరాపల్లి మండలంలో చింతలపూడి, తామరబ్బ, దేవరాపల్లి, కావీపురం, మారేపల్లి, వాలాబు, గరిసింగి, తదితర గ్రామాలు, చీడికాడ మండలంలో కోనాం పంచాయతీలో సాగు చేస్తున్నారు. మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, సబ్బవరం, కశింకోట, పద్మనాభం, ఆనందపురం, అనకాపల్లి, భీమిలి మండలాల్లో పండించిన పామాయిల్ పంటలు బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట వద్ద పామాయిల్ కంపెనీకి తరలిస్తున్నారు. ఇక్కడ తయారైన క్రూడాయిల్‌ను ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి ఎగుమతి చేస్తున్నారు. పామాయిల్ గింజలు నుంచి క్రూడాయిల్ తయారు చేసే కంపెనీ జిల్లాలో బంగారుమెట్టలోనే ఉండడంతో ఈ ప్రాంతంలో సాగు పామాయిల్ సాగు పెంచుతున్నారు.

ప్రభుత్వ రాయితీలు

పామాయిల్ సాగుపై ఆసక్తి ఉంటే ఎకరాకు 50 మొక్కలు చొప్పున ఉచితంగా అందజేస్తున్నారు. నాలుగేళ్ల పాటు హెక్టారుకు రూ. 5,250 రైతుకు అందజేస్తారు. ఈ సమయంలో అంతర పంటలకు కూడా రాయితీలు అందజేస్తారు. ఐదో ఏట నుంచి పంట కాపునకు వస్తుంది. తక్కువ పెట్టుబడితో సుమారు 30 ఏళ్లపాటు ఆదాయం వస్తుండటంతో పామాయిల్ పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు.



తాటిపర్తిలో పామాయిల్ మొక్కలు వేస్తున్న దృశ్యం

ధరలు పెరిగాయి



ఈ ఏడాది కొంత దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 7 టన్నులు రావలసింది. 6 టన్నులే దిగుబడి వస్తుంది. అయితే టన్నుకు రూ.20 వేల వరకు ధర పలకడంతో అందుబాటులో పామాయిల్ మిల్లులు ఉండడం వల్ల పండిన వెంటనే పంటలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆదాయం బాగుంది. చెరకు సాగు చేసినా సరే పేమెంట్లు ఏడాది పొడవునా అందకపోవడంతోపాటు సాగు గిట్టుబాటు కాలేదు.

– శ్రీరాములు, పాయిల్ రైతు, తాటిపర్తి

పంట దశ వరకు రాయితీలు



మొక్కలు వేసిన నాలుగేళ్ల పాటు ప్రభుత్వ రాయితీలు అందజేస్తారు. పామాయిల్ పంట దశకు వచ్చే వరకు అంతర పంటలకు రాయితీలు అందజేస్తారు. పామాయిల్ శాశ్వత ఆదాయం అందిస్తాయి. అందుబాటులో మిల్లులు ఉన్నాయి. ఈ పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అధికంగా ఉంటాయి. మెట్ట భూములతోపాటు పల్లం ప్రాంతాల్లో సాగుపై దృష్టి సారిస్తున్నారు. మొక్కలు ఉచితంగా అందజేస్తున్నాయి. తెగుళ్ల రావు, కూలీలు కూడా పెద్దగా అవరం ఉండదు. – విజయదుర్గ, పామాయిల్ ఫీల్డ్ ఆఫీసర్, మాడుగుల

వైభవంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి, వివిధ సంఘాల సభ్యులు



పరుగు తీస్తున్న గుర్రాలు

మాడుగుల: మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఘాట్‌రోడ్ జంక్షన్ జన సంద్రమైంది. భారీ విద్యుద్దీపాలంకరణ, చిత్ర విచిత్రమైన నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ అమ్మవారి పాదాలు తీర్థం జరిగింది. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ, వర్తక సంఘం, ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు పోటీలు

కాట్వాడ్ రేస్ గుర్రాలు పరుగు పందెం ఆకట్టుకుంది. ఈ పోటీలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. డప్పువాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ అమ్మవారి ప్రతిరూపమైన 101 ఘటాలతో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు నుంచి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం ప్రతినిధులు

చోడవరం: పట్టణం యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా వాకాడ సత్తిబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పల్లా సన్నిబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సింగంపల్లి దుర్గారావు యాదవ్, సంయుక్త కార్యదర్శిగా ఆబోతుల శ్రీనువాసరావుయాదవ్, కోశాధికారిగా మురుగుత్తి అప్పారావుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉరుకూటి గోవిందయాదవ్, లీగల్ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నంబారు నరసింగరావుయాదవ్, మీడియా ప్రతినిధిగా పినబోయిన గోవిందయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జోగ కుర్లన్న యాదవ్ ఎన్నికయ్యారు. సంఘ సీనియర్ నాయకుడు పినబోయిన అప్పారావు యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పడింది. వీరికి సంఘ సభ్యులంతా అభినందనలు తెలిపారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎం.కోడూరు మోదమాంబ

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన బొమ్మల నాగేశ్వరరావు, దేవి దంపతులు ఆర్థిక సాయంతో అమ్మవారికి ప్రసాద వితరణ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు.

కె.జె.పురం మసమ్మతల్లికి ఒడ్డు పండగ

కె.జె.పురంలో మసమ్మ తల్లికి గ్రామానికి చెందిన ఆడారి జగదీష్, బలరామ్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘటాలతో ఒడ్డు పండగ నిర్వహించారు. స్థానిక చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

- గవరపాలెంలో ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం అవగాహన



గవరపాలెంలో మాట్లాడుతున్న ఎస్.ఐ శేఖరం

కె.కోటపాడు: పల్లెల్లో సారా తయారీ విడనాడాలని చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం కోరారు. ఆదివారం గవరపాలెంలో నవోదయంలో భాగంగా సారా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. సారాను సేవించడం వల్ల తీవ్రమైన అనారోగ్యంతో పాటు కేన్సర్ బారిన పడే పరిస్థితులు ఉంటాయన్నారు. సారా తయారీ చేస్తూ పట్టుబడితే కఠిన శిక్షలు అమలు కానున్నట్లు హెచ్చరించారు. సారా తయారీ వృత్తిని విడనాడి ప్రత్యామ్నాయ మార్గాలలో జీవనాన్ని సాగించాలని సూచించారు. తద్వారా సారా రహిత గ్రామాలుగా మార్చేందుకు ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని వినతి



వీఆర్వోల సంఘం రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షుడు శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం వీఆర్వో సంఘం రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షుడు శంకరరావుకు స్థానిక వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలకు గ్రేడ్-1, వీఆర్వో గ్రేడ్-2లకు కామన్ డీడీవోగా నియమించేలా చూడాలని, సచివాలయానికి ఒక వీఆర్వోను నియమించాలన్నారు. పలు పనులకు సంబంధించి తీవ్ర ఒత్తిడితో ఉద్యోగం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇందుకు స్పందించిన శంకరరావు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు కె.రమేష్, బీవీ సత్యనారాయణ, ఈఎస్ఎస్ అప్పారావు, పి.హిమబిందు, సురేష్, అశోక్, మురళి, దేవి, జయకృష్ణ, కోటి, కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న బర్ల నారాయణరావు తదితరులు

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన బర్ల నారాయణరావు రూ.30,116 విరాళంగా అందజేశారు. నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆయన చేతుల మీదుగా ఆదివారం అందించారు. ఈ సందర్భంగా నారాయణరావు కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దెడ్డం కృష్ణ, దంగేటి నాగేశ్వరరావు, దంగేటి ప్రసాద్, బర్ల రమణ, కోరాడ శ్రీను, చింతల శ్రీను, కోళ్లి కృష్ణ, ముర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం స్టేషన్‌లో ఓపెన్ హౌస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భీమరాజు

నాతవరం: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ముందుగా పోలీసులు ఉపయోగించే సామగ్రిపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు చట్టాలు, వీఐపీలకు ఎలాంటి భద్రత కల్పిస్తారన్న అంశాలపై వివరించారు. పోలీసు స్టేషన్‌లో ఆయుధాలను ఏవిధంగా ఉపయోగిస్తారో చూపించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను ఎస్ఐ నివృత్తి చేశారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పందేలు

చీడికాడ: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



గ్రేడింగ్‌లో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

యలమంచిలి రూరల్: మార్షల్ ఆర్ట్స్ జీవితంలో అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని ఫాటో కాన్ ఇండియా కరాటే జూడో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ బోధకుడు పి.నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో యలమంచిలి మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సీనియర్ కరాటే మాస్టర్ నక్కా వెంకటరమణ రంగా ఆధ్వర్యంలో సెమినార్, బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియా కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.శివరామకృష్ణ హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొని విజయం సాధించారు. అనంతరం అర్హత సాధించిన వారికి బెల్ట్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్కా శివ శంకర్‌రావు, అడపా శేషగిరిరావు, దాడి రమేష్, పి.పథ్వీరాజ్, పి.రమేశ్, కె.శ్రీను, కేవీ శ్యామ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత విభేదాలతోనే ఇరువురి ఘర్షణ

దేవరాపల్లి: తెనుగుపూడిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు పార్టీలతో సంబంధం లేదని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం రాత్రి తెనుగుపూడిలో ఇరు పార్టీల నాయకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన అల్లు వెంకునాయుడుపై శనివారం జరిగిన దాడి విషయంలో వారిద్దరి మధ్య వ్యక్తిగత విభేదాలే తప్పా పార్టీలకు సంబంధం లేదన్నారు. టీడీపీ మండల నాయకుడు సెరకాన సూర్యనారాయణ, జనసేన నాయకుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు, రామచరణ్, అర్జునరావు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి



కొవొత్తులతో అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చీడికాడ: మాదిగ అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉద్యోగుల సంఘం కార్యదర్శి ముర్తా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జైతవరంలో మాదిగ అమరవీరులకు కొవొత్తులతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ సంఘం నేతలు కంటిపాము సంతోష్, చిన్న సంతోష్, మంగయ్య, దుర్గాప్రసాద్, మధు, ఏలుచూరి అచ్చన్న పాల్గొన్నారు.

ఎవరెక్స్ పరిశ్రమలో ప్రమాదంపై విచారణ



వివరాలు సేకరిస్తున్న సీఐ నరసింగరావు

రాంబిల్లి(యలమంచిలి): లాలం కోడూరులోని ఎస్ఈజెడ్‌లో ఉన్న ఎవరెక్స్ డ్రగ్స్ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంపై రాంబిల్లి సీఐ సిహెచ్.నరసింగరావు ఆదివారం విచారణ చేపట్టారు. పరిశ్రమలోకి వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ లోపల బాయిలర్ వద్ద రసాయనాలు మిక్సింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగిందా? మరే ఇతర కారణాలు వల్ల జరిగిందా? అని ఆరా తీశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

లారీకి రూ.60 వేలు జరిమానా

అనకాపల్లి: మండలంలో మార్టూరు, బవులవాడ, మామిడిపాలెం గ్రామాల నుంచి రాంబిల్లి మండలానికి అధిక లోడుతో వెళ్తున్న లారీలపై ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కఠిన చర్యలకు దిగారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బవులవాడ నుంచి రాంబిల్లికి అధిక లోడుతో వెళ్తున్న లారీని సీజ్ చేసి రూ.60 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి



పట్టుబడిన పందెంరాయుళ్లతో ఎస్ఐ రమేష్, పోలీసులు

కోటవురట్ల: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటవురట్ల శివారు గవరపేటలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. తీర్థాలు పురస్కరించుకుని కోడి పందేలు ఆడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్ తదితరులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో కొలువైన శ్రీముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. గ్రామ పెద్దలు, నాయకులు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్ చేతుల మీదుగా టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విజేత జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో సోమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రాజ కోటి, వీరప్పారావు, సోమేశ్వరరావు, దాడి శివ, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

‘బ్రాండిక్స్‌లో శ్రమ దోపిడీ’



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం బ్రాండిక్స్(అదిస్తాన్) పరిశ్రమ కార్మికులకు యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్, రవాణా చార్జీలు పోను కార్మికులకు రూ.15వేలు తక్కువ కాకుండా వేతనమివ్వాలని ఆదివారం ఆయన డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు నానాటికీ పెరుగుతున్న తరుణంలో, యాజమాన్యం కోట్లాది రూపాయలు లాభాలు ఆర్జిస్తూ కార్మికులకు భిక్ష వేసుందన్నారు. కార్మికుల జీతాలు పెంచకుండా యాజమాన్యం శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. కార్మికుల మెరుపు సమ్మె సమయంలో వేతనాలు పెంచి, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం ప్రతినిధులు హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ రాయితీలు పొందిన పరిశ్రమ యాజమాన్యం, పని చేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు జీతాలు పెంచి న్యాయం చేయకపోతే, మెరుపు సమ్మెకు దిగుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



సరుగుడు జలపాతం

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాటడుతూ సరదాగా గడిపారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో కోలాహలం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.